క్లుప్తంగా

ప్రతిష్ఠ విగ్రహాలకు ప్రత్యేక పూజలు

పెదనందిపాడు: గంగా చతుర్భుజ అన్నపూర్ణాదేవి సమేత సూర్యేశ్వరస్వామి, గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి విగ్రహాలకు పునఃప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం పాలపర్రు గ్రామంలోని బ్రహ్మశ్రీ కొండ కావూరి నాగభోగేశ్వర శర్మ, రామకృష్ణ శర్మ పర్యవేక్షణలో వేదపారాయణ యంత్ర జపం, నూతన విగ్రహాలకు విశేషాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు అర్చకులు నూతలపాటి సునీల్‌శర్మ తెలిపారు.

త్రిచక్ర వాహనాల పంపిణీ



గుంటూరు రూరల్: ప్రతి కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. గురువారం బ్రాడీపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ సహకారంతో పది మంది లబ్ధిదారులకు త్రి చక్ర వాహనాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన మేరుగ ఎస్తేర్‌రాణి, వి.శ్రీకాంత్ భరత్‌రెడ్డి, బి.పరమారెడ్డి, ఆర్.మహేష్‌బాబు, వి.జీవన్‌బాబు, షేక్ కరిముల్లా, ఎన్.భాగ్యలక్ష్మి, బి.నరసింహారావు, వై.మరియరాణి, బి.ఏసోబు తదితరులకు వాహనాలను అందించినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ ముతాజ్ పఠాన్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ఉద్దగిరి మురళి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఓం ప్రకాష్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



గుంటూరు రూరల్: శివారు కాలనీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని గుంటూరు నగరం 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని జన్మభూమి నగర్‌లో రూ.49.50లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడారు. 20ఏళ్లుగా మురికివాడగా ఉన్న జన్మభూమి కాలనీని నేడు అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు చొరవతో కాలనీ సుందరీకరణ జరగటం సంతోషకంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగరికంటి బంగారయ్య, ఒంటెద్దు శ్రీను, దేవళ్ళ జనార్దన్, రాజు, బ్రహ్మం, పి.ఉమ, రాము పార్టీ నాయకులు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరులో కుండపోత



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో గురువారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల తరువాత నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్షం కురుస్తునే ఉండటంతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రాకపోకలు సాగించే వాహనదారులు కొన్నిగంటల పాటు ఎక్కడి వారే అక్కడి నిలబడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంతా లోతట్టు ప్రాంతాలైన డొంకరోడ్డు, పాతగుంటూరు, అరండల్‌పేట, కొరిటెపాడు, బ్రాడీపేట, నెహ్రూనగర్ ప్రాంతాల్లోని కొన్ని వీధులు జలమయం అయ్యాయి.

క్విజ్ పోటీలకు విశేష స్పందన

ఏఎన్‌యూ: బిజినెస్ క్లబ్‌లో భాగంగా యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్విజ్ పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 19 బృందాల నుంచి 76 మంది విద్యార్థులు మొదటి దశ క్విజ్‌లో పాల్గొన్నారు. ఈ దశలో ప్రతిభ కనబరిచిన ఎనిమిది బృందాలను రెండో రౌండ్‌కు ఎంపిక చేశారు. రెండో రౌండ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మూడు బృందాలను విజేతలుగా ప్రకటించారు. వీరిలో శిరీష నేతృత్వంలోని బృందం మొదటి బహుమతిని, పి.విజయలక్ష్మి నేతృత్వంలోని బృందం రెండో బహుమతిని, సాగర్ నేతృత్వంలోని బృందం మూడవ బహుమతిని పొందాయి. ఫలితాలను కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ఆచార్య ఆర్.శివరామ్‌ప్రసాద్ ప్రకటించి విజేతలకు అభినందనలు తెలిపారు. క్విజ్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎస్.రత్నకిషోర్, డాక్టర్ ఎస్.ప్రసన్న కుమార్ వ్యవహరించారు. విభాగ అధ్యాపకులు పోటీలను పర్యవేక్షించారు.

ఎన్నికల హామీలను నెరవేర్చిన ప్రభుత్వం మనది

'గడప గడపకు'లో ఎమ్మెల్యే సుచరిత

పెదనందిపాడు: గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని పథకాలనూ అమలు చేస్తూ.. ప్రజల మనసులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి నడిపిస్తున్నారన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని గోగులమూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆమె నిర్వహించారు. వైఎస్ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆమె చెప్పారు. ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే సుచరిత.. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. బుక్ లెట్ అందజేసి, ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలు తెలుసుకున్నారు. ముందుగా గ్రామంలో రూ.77.90 లక్షల వ్యయంతో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సుచరిత

ఈ కార్యక్రమంలో ఎంపీపీ టి.హెప్సిబా, సర్పంచ్ చెన్నుపాటి నరసింహరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టరు షేక్ ఖాశీం పీరా, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబ శివరావు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు

'మలినేని'లో ఘనంగా ప్లేస్‌మెంట్ డే

ప్రత్తిపాడు: సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అన్నారు. వట్టి చెరుకూరు మండలం పుల్లడి గుంటలోని మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2022-23 విద్యా సంవత్సరంలో వివిధ విభాగాలకు చెందిన 400 మంది విద్యార్థులు టీసీఎస్, అసెంచ్యూర్, కాగ్నిజెంట్, వొడాఫోన్, ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్, హెక్సావేర్, టెక్ మహీంద్ర వంటి బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. స్థానిక కళాశాలలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన తులసి రామచంద్ర ప్రభును ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. యువత ఉద్యోగం పొందడం నుంచి ఉద్యోగావకాశాలు కలిపించే పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్య ఆర్జేడీ జీవీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా విద్యార్థుల నైపుణ్యం పెంపొందించడం కోసం ఎన్నో అవకాశాలను కల్పిస్తోందన్నారు. ఇందుకు ప్రత్యేక నిధులను వెచ్చిస్తోందని చెప్పారు. కళాశాలల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ల మాట్లాడుతూ ఈ ఏడాది ఐటీ రంగం మాంద్యంలో ఉన్నప్పటికీ మూడేళ్లుగా వృత్తి నైపుణ్య తరగతుల వల్ల 400 మంది విద్యార్థులకు అంతర్జాతీయంగా పేరుపొందిన కంపెనీల్లో ఉద్యోగాలొచ్చాయన్నారు. ట్రైనింగ్స్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్వేత మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో ఏటా ట్రైనింగ్ క్లాసులు ఏర్పాటు చేసి, విద్యార్థుల విజయానికి కృషి చేసినట్లుచెప్పారు. కళాశాలల డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసకుమార్, పాటిబండ్ల నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, కళాశాల డీన్‌లు పి.రమేష్, కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న చైర్మన్ రామచంద్రప్రభు, ఆర్జేడీ, మలినేని

ఇరిగేషన్ స్థలం ఆక్రమణ.. ఇద్దరిపై కేసు నమోదు



చేబ్రోలు: చేబ్రోలులోని జీబీసీ రహదారి పక్కన ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించికొని షెడ్డు నిర్మించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.ఆనంద్ గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అప్పాపురం ప్రధాన కాలువ జీబీసీ రోడ్డు పాయింట్ వద్ద కాలువకు కుడివైపున జలవన రుల శాఖకు చెందిన భూమిని అన్యాక్రాంతం చేసి, రేకుల షెడ్డు నిర్మాణం చేసినట్లు ఇరిగేషన్ ఏఈ బి.రత్న కిషోర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాణాల అనీల్‌కుమార్, బాణాల సునీల్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.ఆనంద్ తెలిపారు.

చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాలలో ఎంసెట్ మాక్ టెస్ట్



చేబ్రోలు: చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం పొన్నూరుకు చెందిన ఇంటర్ విద్యార్థులు 92 మందికి ఎంసెట్ మాక్ టెస్ట్ రాశారు. ఈ మాక్ టెస్ట్‌ను వైస్ ప్రెసిడెంటు గొట్టిపాటి మస్తాన్‌చౌదరి పరిశీలించారు. పరీక్ష సమయంలో విద్యార్థులు పాటించాల్సిన అంశాలను తెలియజేశారు. డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

కిడ్నీ బాధితునికి పింఛను అందజేత

గుంటూరు రూరల్: ప్రజా ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. గురువారం చిన్న పలకలూరు గ్రామంలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రూపన గుంట్ల రాధాకృష్ణ మూర్తిని పరామర్శించి, అతనికి ప్రభుత్వం నుంచి డయాలసిస్ పెన్షన్ రూ.10 వేల నగదును సుచరిత అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించేందుకు జగనన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లు, విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, తంగెళ్ళ నాగేశ్వరరావు, సచివాలయం కన్వీనర్ ఎం వెంకటేశ్వర్లు, దాసరి నాగరాజు, ఎదురుపాక వెంకట్, మెట్టు వెంకటప్పారెడ్డి, నరేష్ వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పింఛను నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

రంగస్థల నటులుగా, కళాకారులుగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- పొన్నూరులో ప్రారంభమైన తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

పొన్నూరు(చేబ్రోలు): అంతరించిపోతున్న రంగస్థల నాటికలు, కళలకు పునర్జీవం పోయాలని, తెలుగు సంప్రదాయాలు, సంస్కృతి భారతదేశ ఔన్నత్యాన్ని చాటుతాయని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. పొన్నూరు కళా పరిషత్ నిడుబ్రోలు- పొన్నూరు ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళా వేదికపై 22వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో జరిగిన ఈ సమావేశానికి పొన్నూరు కళా పరిషత్ నిర్వాహకులు ఆంజనేయులునాయుడు అధ్యక్షత వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడారు. భారతదేశ స్వాతంత్ర్య సమరంలో జై భారత్.. జై హింద్ నినాదాలు భారతదేశ ప్రజలను ఎంతగానో చైతన్య వంతుల్ని చేశాయన్నారు. భావితరాలను రంగస్థల నటులుగా, కళాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఎంపీపీ భవనం పద్మలీల, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఆకుల కొండలరావు, మొదటి రోజు శ్రీ సాయి ఆర్ట్స్ నిర్వహణలో కొలకలూరి వారి ప్రేమతో నాన్న నాటిక, శర్వాణి గ్రామీణ సాంస్కృతిక సేవా సంఘం బోరివంక, శ్రీకాకుళం వారి కొత్త పరిమళం నాటిక పోటీలను ప్రదర్శించారు. ఈ నాటిక పోటీలు ఆహుతులను ఎంతగానో అలరింపజేశాయి.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

ముగిసిన అమ్మవారి జయంత్యుత్సవాలు

పాత గుంటూరు: ఆర్.అగ్రహారంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అర్బన్ జిల్లా ఆర్య వైశ్య సంఘం, యువజన సంఘం, సేవాదళ్, మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం విశేష పూజలు, అమ్మవారికి లక్ష గులాబీ పూలతో పుష్పార్చన, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, టీఎల్‌వీ వీరాంజనేయులు, సంఘాల అధ్యక్షులు ఆతుకూరి నగేష్‌కుమార్, అమరా శ్రీనివాసరావు, మొగిలి సతీష్‌కుమార్, యిమ్మడిశెట్టి ప్రమీలారాణి, కార్యదర్శులు యేచూరి వెంకయ్య, జి.మహేష్, రంగా మురళీకృష్ణ, అమరా షర్మిల, కోశాధికారులు రవికుమార్, నాగేంద్ర,శ్రీకాంత్, పరిమి నాగ పరిపూర్ణ, ఈఓ దుర్గారావు, పర్యవేక్షించారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా

నైపుణ్యాలు పెంచుకుంటే ఉన్నత భవిష్యత్తు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యపై శ్రద్ధాసక్తులే విద్యార్థులను ప్రతిభావంతులుగా నిలబెడతాయని ఏఎన్‌యూ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డీన్ ఆచార్య భట్టు నాగరాజు పేర్కొన్నారు. గురువారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి, మంచి నడవడికతో నైపుణ్యాలను పెంచుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. రమేష్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రావెల నీరేన్ మాట్లాడుతూ విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఏఎన్‌యూ ఇటీవల విడుదల చేసిన ద్వితీయ సంవత్సర తృతీయ సెమిస్టర్ ఫలితాల్లో ఎంబీఏ, ఎంకామ్‌లలో నూరుశాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. ఎంబీఏలో షేక్ రిజ్వానా, జి.లక్ష్మీసౌమ్య, ఎం.కీర్తి చంద్రిక, ఎంకామ్‌లో పి.శ్రీవాణి, ఎ.వైష్ణవి, కిరణ్‌కుమార్ నగదు బహుమతులు పొందినట్లు తెలిపారు. కళాశాల కార్యదర్శి రామకృష్ణమూర్తి, ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ప్రొఫెసర్ కె.లలిత, సహాయాచార్యులు కల్యాణి, వైష్ణవి, బాజీబాబు, వేదవతి, పద్మావతి, మణికంఠ, అభిలాష్ పాల్గొన్నారు.

మిర్చి పంట పరిశీలన

ప్రత్తిపాడు: జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత మిర్చి పంటను పరిశీలించారు. ఐదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్తిపాడు హెచ్‌వో బేబితో కలిసి పాత మల్లాయపాలెం, కొత్త మల్లాయ పాలెం గ్రామాల్లో ఆమె పర్యటించారు. కల్లాల్లోకి వెళ్లిన తడిసిన మిర్చిని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. తేమశాతం, తాలు కాయలు, పెట్టు బడి, దిగుబడి.. వంటి విషయాలను తెలుసుకున్నారు. మండలంలో దాదాపుగా 90 శాతం మిర్చి కోతలు పూర్తయ్యాయని, మిగిలినవి కల్లాల్లో ఎండబెట్టారని చెప్పారు. రైతులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



మిర్చి పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి సుజాత

లోకోస్ యాప్‌పై శిక్షణ

పొన్నూరు(చేబ్రోలు): ప్రభుత్వం పొదుపు సంఘాలను ప్రోత్సహించేందుకు కల్పిస్తున్న ఆర్థిక రుణాలు పారదర్శకంగా ఉండేందుకు లోకోస్ యాప్ ఉపయోగపడుతుందని పొన్నూరు ఎంపీపీ భవనం పద్మలీల పేర్కొన్నారు. పొన్నూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ డ్వాక్రా సంఘాల అసిస్టెంట్స్‌కు లోకోస్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మలీల పాల్గొని, మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఒకే యాప్‌లో మహిళా సంఘాల సభ్యుల లావాదేవీలు వివరాలు చూసుకోవటానికి లోకోస్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి వీవోఏ సంఘ సభ్యుల వివరాలు పారదర్శకంగా పక్కాగా నమోదు చేసేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఏపీఎం గోపీ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) ఆధ్వర్యంలో ఈ యాప్ పనిచేస్తుందన్నారు. లోకోస్ యాప్ పనిచేసే విధానాన్ని వీవోఏలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భవనం మారుతి శేషమాంబ, మండల సమైక్య అధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మలీల

'కళ్లం'లో ప్లేస్‌మెంట్ అచీవర్స్ సక్సెస్ మీట్

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నైపుణ్యాలతో కూడిన విద్య.. ఉజ్వల భవిష్యత్తు అందించటం తమ కళాశాల లక్ష్యమని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జరిగిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 540 మందికి పైగా విద్యార్థులు 35కు పైగా కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. అత్యధికంగా రూ.12లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలను ఎందరో సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి

భారీ వర్షం.. రైతులకు నష్టం

చేబ్రోలు: మండలంలో గురువారం కురిసిన అకాల వర్షం రైతులకు తీవ్రంగా నష్టం చేసింది. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా కురిసిన కుంభవృష్టితో మొక్కజొన్న, జొన్న, అపరాల రైతులు నష్టపోయారు. మిర్చి రైతులకు అపార నష్టం కలిగింది. మంచాల, తొట్లపాలెం, చేబ్రోలు, సుద్దపల్లి, శ్రీరంగపురం, వడ్లమూడి, శలపాడు తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న, తెల్లజొన్న పంటలు నీట మునిగాయి. కోత కోసిన జొన్న పంట నీట నానుతోంది. కలాల్లో ఆరబోసిన మిర్చిని కాపాడుకోవడం కోసం రైతులు టార్పాలిన్ పట్టలు కప్పారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతవరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో రైతులను ఆందోళనకు గురవుతున్నారు.

జలమయం..

చేబ్రోలులో అకాల వర్షంతో రహదారులు జలమయం అయ్యాయి. నారాకోడూరు దళితవాడ ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచి, తటాకాన్ని తలపించింది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవటంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోనికి వర్షపు నీరు చేరటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. వడ్లమూడి, చేబ్రోలు గ్రామాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది.



గొడవర్రులో నీటిలో నానుతున్న మొక్కజొన్న కండెలు

ఐక్య చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

గుంటూరు రూరల్: రెడ్డి సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి చేపట్టబోతున్న రెడ్ల ఐక్య చైతన్య యాత్రను స్థానిక సంఘాలు కలిసి విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో జరగనున్న ఈ యాత్రకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. రెడ్డి విద్యార్థులకు విదేశీ విద్య పథకం, నిరుద్యోగులకు స్వయం ఉపాధి, రెడ్డి కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరు, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకు వెళ్తాని చెప్పారు. ఈ యాత్రను విజయవంతం చేసేందుకు స్థానిక రెడ్డి సంఘాలు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి, యువజన విభాగం కార్యదర్శి అలవల శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇంటూరి సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి

ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

పట్నంబజారు: గుంటూరు ఎస్పీ కె.ఆరీఫ్ హాఫీజ్ గురువారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలకు సంబంధించి స్టేషన్ సీఐ నిసార్ బాషాను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవడంతోపాటు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. రాత్రిళ్లు విధులు నిర్వర్తించేవారు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్, పల్నాడు బస్టాండ్, నాజ్‌సెంటర్, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, మణిపురం బ్రిడ్జి, తదితర ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ నరసింహారావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

820 మందిపై 758 కేసులు నమోదు..

నగరంపాలెం: కొద్దిరోజులుగా జిల్లావ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన 820 మందిపై 758 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరీఫ్ హాఫీజ్ గురువారం తెలిపారు. పోలీసు అధికారులు పలు ప్రాంతాల్లో పర్యటించి అటువంటి వారిపై టౌన్ న్యూసెన్స్ చట్టంతోపాటు, ఐపీసీ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాడీపేట 2/5లో నివసించే అవనిగడ్డ కల్యాణి గతనెల 10వ తేదీ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఊరు వెళ్లింది. బుధవారం ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని స్థానికులు ఫోన్ చెసి సమాచారం ఇచ్చారు. గురువారం గుంటూరు వచ్చి ఇల్లు పరిశీలించగా బీరువాలోని రూ.80వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రగతి నగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక బుధవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లారెన్స్ నైటింగేల్ విగ్రహావిష్కరణ

గుంటూరు మెడికల్: గోరంట్ల ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో గురువారం ఫ్లారెన్స్ నైటింగేల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గతంలో నర్సింగ్ డెప్యూటీ డైరెక్టర్‌గా పని చేసి, కోవిడ్‌తో చనిపోయిన చదలవాడ శ్రీలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె భర్త దొడ్డా గోవిందరావు ఫ్లారెన్స్ నైటింగేల్ విగ్రహాన్ని నర్సింగ్ కళాశాలకు బహూకరించారు. అంతే కాకుండా నర్సింగ్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించేందుకు రూ. 15 లక్షలు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి విరాళంగా అందజేశారు. ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ కె.సుశీల, నర్సింగ్ డెప్యూటీ డైరెక్టర్ వల్లి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కళావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.